

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

అన్నమయ్య జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. వీరికి నాయకులు సాదర స్వాగతం పలికారు. -8లో



వైఎస్ కుటుంబమంతా జగన్ వెంటే

వైఎస్ కుటుంబమంతా వైఎస్ జగన్ వెంటే ఉందని దివంగత వైఎస్సార్ సోదరుడు వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.170	రూ.210
రెండోరకం	రూ.110	రూ.160



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 298 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	215	462
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 248.000 కిలోలు

న్యూస్‌రీల్

10, 11 తేదీల్లో వివాహ వ్యవస్థపై అవగాహన

కడప కల్చరల్: కడప మేత్రాసనం ఆదేశాల మేరకు నగర శివారులోని రామాంజనేయపురంలో గల పాస్టరల్ సెంటర్‌లో మే 10, 11 తేదీల్లో వివాహ వ్యవస్థపై యువతీ యువకులకు అవగాహన కల్పించనున్నట్లు సెంటర్ డైరెక్టర్ ఫాదర్ వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండురోజులపాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. డాక్టర్, లాయర్, పోలీసు అధికారి, గురువులు, కన్య స్త్రీలు కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేత వీరభద్రుడు



పల్లకీ సేవలో ఊరేగుతున్న వీరభద్రస్వామి

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి శ్రీ వీరభద్రస్వామి వారికి, భద్రకాళీ అమ్మవారి మూల విరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి అలంకరణ చేసి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాడవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు.

ఏపీజీబీ చైర్మన్‌గా సత్యప్రకాశ్‌సింగ్



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సత్యప్రకాశ్‌సింగ్ సోమవారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రాకేష్ కశ్యప్ బెంగళూరుకు బదిలీపై వెళ్లగా, అక్కడ పనిచేస్తున్న సత్యప్రకాశ్‌సింగ్ ఇక్కడికి వచ్చారు. అనంతరం బ్యాంకు అధికారులతో నూతన చైర్మన్ మాట్లాడుతూ ఖాతాదారులకు మరింత నాణ్యమైన సేవలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఇతర వాణిజ్య బ్యాంకులతో సమానంగా డిజిటలైజేషన్ ప్రక్రియలో ముందుకు కొనసాగుతోందని వివరించారు. అంతేకాకుండా బ్యాంకు సర్వతోముఖాభివృద్ధికి అధికారులు, సిబ్బంది నిజాయితీగా తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ విజయభాస్కర్, ఆర్.గిరి, టీఆర్ పడగెట్వర్, సంజీవప్ప, రాజేంద్రన్, హర్శేశ్వరప్రసాద్, రంజిత్ కుమార్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

డ్యూయల్ డిగ్రీ అవకాశాన్ని వినియోగించుకోండి

వైవీయూ : ఒకే విద్యా సంవత్సరంలో రెండు డిగ్రీలు చదువుకునే అద్భుత అవకాశం నేటి విద్యార్థులకు, ఉద్యోగులకు, అన్ని వర్గాలకు ఉందని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం వైవీయూలోని సెనేట్‌హాల్లో దూర విద్యా సంచాలకులు ఆచార్య కె. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రెగ్యులర్, ఆన్‌లైన్, దూరవిద్య కోర్సులు సమానమేనన్నారు. ప్రభుత్వం కూడా వీటికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రెగ్యులర్ కోర్సుల తీరులోనే మిగిలిన వాటికి సెమిస్టర్ విధానం అమలవుతుందన్నారు. జాతీయ విద్యావిధానం - 2020 ప్రకారం విద్యార్థి కేంద్రీకృతంగా విద్య వచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి డిగ్రీ, పీజీ రెగ్యులర్ కోర్సులతో పాటు దూరవిద్య కోర్సులను ఒకే అకడమిక్ ఇయర్‌లో చదువుకోవచ్చు అన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో రెండింటికీ సమాన విలువ ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ డ్యూయల్ డిగ్రీ చదువుకునే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. వైవీయూలో లభించే దూర విద్య కోర్సులకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. దూరవిద్య సంచాలకులు ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైవీయూలో అందుబాటులో ఉన్న 8 కోర్సుల గురించి వివరించారు. ఫిజికల్ మోడ్, ఓడీఎల్ విధానం, ఆన్‌లైన్ స్టడీ గురించి వివరించారు.

విజయ సంకల్పం

- ఇప్పటికే మదనపల్లెలో మేమంతా సిద్ధం సభ ద్వారా దిశా నిర్దేశం
- ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులను కార్యోన్ముఖులను చేస్తున్న సీఎం
- అన్నమయ్య జిల్లాలో అగ్రభాగాన అభివృద్ధి
- నేడు కలికిరిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగసభ
- హాజరు కానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





కలికిరిలో సీఎం బహిరంగ సభా స్థలం పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు, తదితరులు

సాక్షి రాయచోటి: ప్రజల సంక్షేమం కొనసాగాలన్నా.. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలన్నా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. రాజు బాగుంటేనే... రాజ్యం బాగుంటుందన్న నానుడి ఎంత నిజమో జగన్ సర్కార్‌లో పేద వర్గాలకు సంక్షేమ పాలన అందిందన్నది అంత నిజం. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రజలతోపాటు శ్రేణులను సిద్ధం, మేమంతా సిద్ధం బస్సు యాత్రల ద్వారా కార్యోన్ముఖులను చేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు నియోజకవర్గాల సభల్లో పాల్గొంటున్నారు. ఎక్కడ చూసినా అగ్ని గుండంలా మండుతున్న సూర్యుడి వేడి కిరణాలను కూడా లెక్క చేయకుండా...జగన్ సైనికులు కెరటంలా కదిలి వస్తున్నారు. అడుగడుగునా ముఖ్యమంత్రి సభకు జనం పోటెత్తుతున్నారు. ఇప్పటికే అన్నమయ్య జిల్లాను అభివృద్ధి పరంగా...పేద వర్గాలకు సంక్షేమ ఫలాల పరంగా పూర్తి స్థాయిలో ప్రభుత్వం ద్వారా అందించారు. అయితే సార్వత్రిక ఎన్నికల తరుణంలో ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ జిల్లాలోని మదనపల్లెలో సిద్ధం సభ ద్వారా పార్టీ నేతలు, కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేశారు. అంతేకాకుండా బస్సు యాత్రతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపిన సీఎం మరోమారు పీలేరు నియోజకవర్గంలోని కలికిరిలో మంగళవారం జరగనున్న బహిరంగ సభకు రానున్నారు.

‘అన్నమయ్య’లో అపార అభివృద్ధి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నమయ్య జిల్లాను పురోగతి బాట పట్టించింది. ప్రధానంగా జిల్లాలో పునర్విభజనలో భాగంగా రాజంపేట పార్లమెంటును జిల్లాగా మార్చి జిల్లా కేంద్రంగా రాయచోటిని ఎంపిక చేశారు. అంతకుముందు కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడమే కాకుండా ప్రత్యేకంగా వారిని కంటికిరెప్పలా కాపాడుకుంది. మరోవైపు అంతే వేగంగా జిల్లాను అభివృద్ధి చేసింది. ప్రధానంగా జిల్లా కేంద్రమైన రాయచోటిలో రూ. 25 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రాయచోటి ప్రజల దాహార్తి తీర్చేందుకు రెండవ పైపులైన్ కోసం రూ.100 కోట్లు వెచ్చిస్తోంది. పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. రాయచోటిలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి సుమారు రూ. 100 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా సుమారు రూ. 8 కోట్లతో శిల్పారామం, కేంద్రీయ విద్యాలయం, పీజీ కళాశాల, మరో రూ. 3 కోట్లతో నగరవనం, ఆటలకు సంబంధించి క్రికెట్ స్టేడియం, మధ్యతరగతి ప్రజలకు సంబంధించి 50 ఎకరాల్లో ఎంఐజీ లే అవుట్, డబుల్‌రోడ్డు నిర్మాణాలు, మున్సిపాలిటీ పరిధిలో పార్కులు, నూతనంగా ఆర్టీసీ బస్టాండు, రైతు బజారు, సర్కిళ్లు, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, టౌన్ పోలీసు స్టేషన్, డీఎస్పీ కార్యాలయం, ఇంకా అనేక రకాల అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మదనపల్లెలో మూడు ఎకరాల్లో సుమారు రూ. 500 కోట్లతో మెడికల్ కళాశాల హైలెట్‌గా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కేంద్రీయ విద్యాలయం, మదనపల్లె వాసుల ఎన్నో ఏళ్ల కలగా ఉన్న బీటీ కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లడం, సుమారు రూ. 200 కోట్లతో గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధితోపాటు ఇతర అనేక విధాలుగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గంలోనూ వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి జరిగింది. పీలేరులో కూడా రూ. 24 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, వందలాది కోట్లతో పీలేరు-తిరుపతి జాతీయ రహదారి నిర్మాణ పనులు , రైల్వేకోడూరు పరిధిలో రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జిలు, చిట్వేలి-రైల్వేకోడూరు ఫోర్‌లేన్‌రోడ్డు, రాజంపేట పరిధిలో రూ. 80 కోట్లతో పింఛా ప్రాజెక్టును దాదాపుగా పూర్తి చేశారు.

డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా భారీగా లబ్ధి

అన్నమయ్య జిల్లాలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ. 9450 కోట్ల మేర లబ్ధి చేకూరింది. అనేక రకాల పథకాల ద్వారా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించారు. ప్రతి నియోజకవర్గానికి సుమారు రూ. 1500 కోట్ల మేర ప్రయోజనం ఒనగూరింది. పేద, మధ్యతరగతి, ఇతర తారతమ్యాలు చూడకుండా పారదర్శకంగా, అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందించారు.

మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ

అన్నమయ్య జిల్లాలోని పీలేరు నియోజకవర్గం కలికిరిలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే బహిరంగసభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

కలికిరి: పట్టణ పరిధిలోని నాలుగు రోడ్లు(గాంధీ కూడలి) వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బహిరంగ సభ మంగళవారం జరగనున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ కృష్ణారావు, ఏపీఎండీసీ డైరెక్టర్ సి.హరీష్ రెడ్డి సోమవారం పరిశీలించారు. అనంతరం సైనిక పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని వారు పరిశీలించారు. హెలిప్యాడ్, రోడ్డు మార్గం, బహిరంగ సభా స్థలం వద్ద ఏర్పాటు చేయాల్సిన భద్రతా చర్యలపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, డీఎస్పీ మహబూబ్ బాషా, పీలేరు, కలికిరి సీఐలు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గాల్లో విజయసంకల్పం తీసుకునేలా శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటికే మదనపల్లెలో మేమంతా సిద్ధం సభ నిర్వహించారు. అనంతపురం జిల్లా సరిహద్దు నుంచి ములకలచెరువు మీదుగా మదనపల్లె వరకు బస్సు యాత్రతో పార్టీ శ్రేణులు కదం తొక్కగా సభ ద్వారా వారిలో ఉత్సాహాన్ని నింపారు. అంతేకాకుండా పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో అన్ని నియోజకవర్గాల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలను సన్నద్ధం చేసేందుకు మంగళవారం పీలేరు నియోజకవర్గంలోని కలికిరిలో భారీ బహిరంగ సభ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఫీజు చెల్లింపునకు ఒక్కరోజే గడువు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపునకు 30వ తేదీ ఒక్క రోజు మాత్రమే గడువుందని ఇంటర్ ఆర్‌ఐవో బండి వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. ఫీజు చెల్లించని విద్యార్థులెవరైనా ఉంటే వెంటనే ఫీజు చెల్లించాలన్నారు.

వైవీయూ బీటెక్, ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, సీఈ తదితరులు

వైవీయూ: వైవీయూ పరిధిలోని ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్, ఎంసీఏ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, ఆచార్య ఎస్.సి. గంగిరెడ్డి, డాక్టర్ కె. శ్రీనివాసరావుతో కలిసి వీసీ సోమవారం వైవీయూలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో నిర్వహించిన సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ బీటెక్ ఫస్ట్ ఇయర్ ప్రథమ సెమిస్టర్ పరీక్షల్లో 46.43 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. సెకండియర్ ప్రథమ సెమిస్టర్‌లో 53.47 శాతం మంది పాసయ్యారన్నారు. సెకండియర్ ఫస్ట్ సెమిస్టర్ చాయిస్ బేస్ట్ క్రెడిట్ సిస్టం విధానంలోని సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్, మెటలర్జీ మెటీరియల్ సైన్స్ టెక్నాలజీలో 60.74 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పీజీ ఎంసీఏ మూడో సెమిస్టర్‌లో 74.51 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

బరిలో మిగిలింది వీరే



రాజంపేట పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి

- రాజంపేట పార్లమెంటు స్థానంలో 18 మంది అభ్యర్థులు
- అసెంబ్లీ స్థానాలకు 80 మంది
- జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ వెల్లడి

రాయచోటి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక రాజంపేట లోక్‌సభ బరిలో 18 మంది, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 80మంది అభ్యర్థులు పోటీలో నిలిచారని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ మేరకు సోమవారం 24-రాజంపేట పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎం.అభిషిక్త్‌కిషోర్ నిర్వహించారు. పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లలో 20 మంది అభ్యర్థులను అర్హులుగా గుర్తించారు. అందులో ఇద్దరు తమ నామినేషన్లను సోమవారం ఉపసంహరించుకుంటున్నట్లు రిటర్నింగ్ అధికారికి తమ సమ్మతిని సమర్పించారు. పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 18 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అనంతరం రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో అభ్యర్థులకు గుర్తులను కేటాయించే కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు. అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం సందర్భంగా ఈ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు రాయచోటి కలెక్టరేట్‌లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

నియోజకవర్గాల వారీగా పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య

నియోజకవర్గం	అభ్యర్థుల సంఖ్య
రాజంపేట (లోక్‌సభ)	18
రాజంపేట (అసెంబ్లీ)	12
రాయచోటి	15
తంబళ్లపల్లె	11
పీలేరు	12
మదనపల్లి	15
కోడూరు(ఎస్సీ)	15

చంద్రబాబు-కిరణ్ ఇద్దరూ వెన్నుపోటుదారులే

- ప్రజలు తిరస్కరించినా బాబుకు బుద్ధి రాలేదు
- ముదివేడు రిజర్వాయర్ పనులు అడ్డుకుంది బాబే
- రెండేళ్లలో తాగు-సాగునీరు అందిస్తాం
- ములకలచెరువు సభలో మంత్రి పెద్దిరెడ్డి



ములకలచెరువు సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. పక్కన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

బి.కొత్తకోట: పదవి కోసం మామకు చంద్రబాబు, రాష్ట్ర విభజనకు కారకుడైన కిరణ్ ఇద్దరు వెన్నుపోటు దారులేనని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ములకలచెరువులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల సభ జరిగింది. ఈ సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పదవీ కాంక్షతో కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర విభజనకు సహకరిస్తారని ఢిల్లీ పెద్దలకు సమ్మబలికారన్నారు. పదవి నుంచి దిగిపోయి రాజీనామా చేశారన్నారు. పదవి దిగిపోయాక ఇక్కడికి ఏనాడైనా వచ్చాడా, అభివృద్ధి చేశాడా, ఏమీ చేయని కిరణ్ ఎంపీగా పోటీ చేస్తే ఆదరిస్తారా అని ప్రజలను ప్రశ్నించారు. రాష్ట్రాన్ని విడగొట్టి రాజధాని లేకుండా చేసిన కిరణ్ వైఎస్ కుటుంబానికి అన్యాయం చేశారని చెప్పారు. 2014లో మేనిఫెస్టో పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేస్తే 2019లో తిరస్కరించారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే మోసాలతో ప్రజలను నమ్మించేందుకు వస్తున్నారని, ఇప్పటికి చంద్రబాబుకు బుద్ధి రాలేదని అన్నారు. జగన్ గత ఎన్నికల్లో చెప్పినవి చేశాక ఇప్పుడు ఎన్నికలకు వెళ్తున్నారని తెలిపారు. జనసేన, టీడీపీ, బీజేపీ చెప్పేమాటలు నమ్మవద్దని కోరారు. సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలన్నారు. ఉమ్మడి చిత్తూరు పశ్చిమ మండలాల్లో కరువును గుర్తించిన ప్రభుత్వం మూడు రిజర్వాయర్లను మంజూరు చేసిందన్నారు. ఒకటి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ముదివేడులో నిర్మాణం చేపడితే చంద్రబాబు చొరవతో కోర్టు ద్వారా పనులు నిలిపి వేయించారన్నారు. ఎన్నికల తర్వాత కోర్టులో కేసు గెలిచి ముదివేడు రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తంబళ్లపల్లెలో ద్వారకనాథరెడ్డి ఎమ్మెల్యే అయ్యాకనే అన్ని రకాల అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి ప్రసంగించారు. పుంగనూరు నేతలు అనీషారెడ్డి, శ్రీనాథరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్ ఉమాపతిరెడ్డి, పరిశీలకులు ఇరగం సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, రెడ్డిశేఖర్‌రెడ్డి, కొండా సిద్దార్థ, పెదబాబు రామకృష్ణారెడ్డి, పప్పు రాజారెడ్డి పాల్గొన్నారు.

తంబళ్లపల్లెకు పరిశ్రమలు తెస్తా

నియోజకవర్గంలో పుష్కలంగా భూములు ఉన్నాయి.. నీటి సమస్యలు పరిష్కారమైతే పరిశ్రమలు వచ్చే విధంగా కృషి చేస్తానని రాజంపేట ఎంపీ అభ్యర్థి మిథున్ రెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా ప్రాజెక్టు పుంగనూరు ఉప కాలువ వెడల్పు పనులకు ఒప్పందం ప్రక్రియ పూర్తయిందన్నారు. గండికోట రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా ఇక్కడికి తరలిస్తామన్నారు. పీలేరు, పుంగనూరు, మదనపల్లి, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు ఇంటింటికి నీటిని అందిస్తామన్నారు.

ఆత్మీయ పలకరింపు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డి సోమవారం వేంపల్లెలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. వారి కష్ట సుఖాలు తెలుసుకుంటూ.. అండగా ఉంటానని భరోసా ఇస్తూ ముందుకు కదిలారు. -వేంపల్లె

సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత సంతృప్తికరం



ఎన్నికల నిర్వహణపై సమీక్షిస్తున్న రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగం

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఎన్నికల సన్నద్ధత సంతృప్తికరమని, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరు ప్రశంసనీయమని రాష్ట్ర ప్రత్యేక వ్యవసాయ పరిశీలకుడు నీనా నిగం, ఐఆర్‌ఎస్ (రిటైర్డ్) పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జాతీయ ఎన్నికల కమిషన్ జేఏసీ రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులుగా నియమితులైన నీనా నిగం జిల్లాకు కేటాయించిన సాధారణ పరిశీలకులు ఓం ప్రకాష్ బంకర్ (ఐఏఎస్), ఎన్నికల వ్యయ పరిశీలకులు రవీందర్ కుమార్ (ఐఆర్‌ఎస్), ఎస్‌జి మూన్ (ఐఆర్‌ఎస్), వైభవ్ శుక్ల (ఐఏఏఎస్)లకు అన్నమయ్య జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఎంసీసీ, వ్యయ పర్యవేక్షణ సమాచార సాంకేతికత, ఈవీఎంల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్‌ల నిర్వహణ, ఎంసీఎంసీ తదితర అంశాలకు నోడల్ ఆఫీసర్లను కేటాయించామని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న, విడుదల చేసిన డబ్బు, మద్యం తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి ఆమెకు వివరించారు. అనంతరం రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఎన్నికలలో పోటీ చేయబోయే ప్రతి ఒక అభ్యర్థి సమాన అవకాశాలు ఉండాలని, అలాంటి అవకాశాలను కలిగించడంలో ఎన్నికల స్పిబంది పాత్ర ఎంతో కీలకమన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎన్నికలకు సన్నద్ధత సంతృప్తికరంగా ఉందని చెప్పారు. అలాగే ఎన్నికలకు కేటాయించిన సిబ్బంది పనితీరు ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగం పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యం


సుష్మిత(ఫైల్)

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సుపల్లి నివాసి బుసర శేఖర్ కుమార్తె సుస్మిత(17) అదృశ్యమైనట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

టీడీపీ ప్రచార రథంపై తమ్ముళ్ల రాళ్లదాడి


రాళ్ల దాడిలో పగిలిన అద్దం

బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లెలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ వాహనంపై రాళ్ల దాడి జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సురేంద్ర అనే కార్యకర్త టీడీపీ అభ్యర్థి తరఫున స్కార్పియో వాహనంతో వెళ్లి కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్నాడు. ఈ క్రమంలో మారెప్ప అనే టీడీపీ కార్యకర్తకు సురేంద్ర కరపత్రం ఇచ్చాడు. దీనిపై మారెప్ప తాను కూడా టీడీపీ కార్యకర్తేనని, తనకెందుకు కరపత్రం ఇస్తున్నావని ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది. ఇంతలో వాహనం అద్దంపై రాళ్లదాడి జరగడంతో వివాదం చోటుచేసుకుంది. దీనితో అద్దం పగిలిన వాహనాన్ని స్టేషన్‌కు తరలించి పోలీసులు విచారిస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్ నాగమునెప్ప అనే వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నారాయణపల్లె పంచాయతీ, ముదినేనివడ్డిపల్లెకు చెందిన నాగమునెప్ప ద్విచక్ర వాహనంలో రాయచోటి వైపు వెళ్తుండగా మోటగట్ల సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తీవ్ర గాయాలైనట్లు వారు తెలిపారు. క్షతగాత్రుని 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

బీసీవైపీ ప్రచార రథాలు ధ్వంసం


ధ్వంసమైన వాహనాలు

పీలేరు : అన్నమయ్య జిల్లా పీలేరు మండల పరిధిలో వేపులబైలు గ్రామం సమీపంలో తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బీసీవైపీ(భారత యువజన చైతన్య పార్టీ) ప్రచార వాహనాలను ధ్వంసం చేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. నాలుగు బీసీవైపీ ప్రచార రథాలు కలికిరి వైపు నుంచి పీలేరు వైపు వెళుతుండగా, కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వీటిని వెంబడించారు. వాహనాలను ఓవర్ టేక్ చేయడంతో ప్రచార రథాలను నిలిపిన డ్రైవర్లు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు మూడు వాహనాల ధ్వంసానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో మరో వాహనానికి నిప్పంటుకుంది. పీలేరు పోలీసులు మంటలను అదుపుచేశారు.

అభివాదం చేస్తూ.. అనురాగం చూపిస్తూ..

వేంపల్లిలో సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి విస్తృత ప్రచారం

వేంపల్లె : వేంపల్లెలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సతీమణి వైఎస్ సమతారెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ సతీష్‌కుమార్‌రెడ్డి సతీమణి సుమతిరెడ్డిలు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ముందుగా వీరికి మహిళలు హారతులు పట్టి బ్యాండు వాయిద్యాలతో స్వాగతం పలికారు. జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలు వైఎస్ భారతిరెడ్డి, వైఎస్ సమతారెడ్డిలకు దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలను అందించి ఘన స్వాగతం పలికారు.

స్థానిక వైఎస్ఆర్‌సీపీ కార్యాలయం నుంచి నాలుగురోడ్ల కూడలి, గాంధీరోడ్డు, అమ్మవారిశాల వీధి, మెయిన్ బజార్, పాతపేట, కాపువీధి, జీఎం కాంప్లెక్స్, కాలేజీరోడ్డు, రాఘవేంద్ర స్కూల్ ఏరియా, బిడాలమిట్ట వీధులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ఐదేళ్ల కాలంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే ప్రస్తుత మేనిఫెస్టోలో పొందుపరచిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ జోరుగా ప్రచారాన్ని కొనసాగించారు. ఇంటింటా ప్రచారంలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా చిరునవ్వుతో పలకరిస్తూ పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్‌సీపీకే ఓటు వేస్తామని చెప్పడంతో వారు చిరునవ్వుతో ముందుకుసాగారు. వికలాంగులు, వృద్ధులు, దుకాణదారులు, చేతివృత్తులు చేసుకునేవారు, అనారోగ్యంతో మంచంలో ఉన్న వారిని కూడా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండండి.. మళ్లీ మన జగనన్న ప్రభుత్వమే వస్తుందని వారికి భరోసా కల్పిస్తూ ప్రచారాన్ని ముందుకు సాగించారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మళ్లీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ సతీష్‌కుమార్‌రెడ్డి కుమారులు తుషార్ నాగిరెడ్డి, రోహన్ నాగిరెడ్డి, హజ్‌హౌస్ రాష్ట్ర డైరెక్టర్ మునీర్ బాషా, మైనింగ్ అండ్ మినరల్స్ రాష్ట్ర డైరెక్టర్ సల్మా, మాజీ జడ్పీటీసీ సభ్యులు షబ్బీర్‌వలి, డా.ఎస్ఎఫ్ బాషా, యూత్ కన్వీనర్ రవిశంకర్ గౌడ్, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి


వ్యాపారస్తులకు అభివాదం చేస్తున్న వైఎస్ భారతిరెడ్డి


వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ భారతిరెడ్డి


మాజీ సర్పంచ్ రామలింగయ్యతో మాట్లాడుతున్న వైఎస్ భారతిరెడ్డి


సంక్షేమ కరపత్రాలను అందజేసి ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్ సమతారెడ్డి


ప్రచారంలో పాల్గొన్న మహిళలు

వెల్డర్ అనుమానాస్పద మృతి

పనిచేస్తున్న షాపులోనే ఉరి వేసుకున్న వైనం


జాఫర్ ఖాన్ మృతదేహం

మదనపల్లె : తాను పనిచేస్తున్న షాపులోనే ఓ వెల్డర్ ఉరి వేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని ఇందిరానగర్ కు చెందిన పఠాన్ కలందర్ ఖాన్ కుమారుడు పఠాన్ జాఫర్ ఖాన్ (39) అల్యూమినియం కిటికీలు తయారు చేసే వెల్డర్ గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఎం.ఎస్.ఆర్.సర్కిల్‌లోని జనతా కాంప్లెక్స్ లో నిర్వహిస్తున్న దుకాణంలో పని చేస్తున్నాడు. జాఫర్ ఖాన్ భార్య ఐదు సంవత్సరాల క్రితమే అతనికి విడాకులు ఇచ్చి వెళ్లిపోయింది. అతనికి 10 సంవత్సరాల వయసున్న కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తాను పనిచేస్తున్న దుకాణంలోనే జాఫర్ ఖాన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందే పట్నానికి చెందిన మరో మహిళకు ఫోన్ చేసి మాట్లాడాడు. తనకు ఇబ్బందులు ఎక్కువయ్యాయని, ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్ చేసి చెప్పాడు. అనంతరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. షాపులోని సీసీ కెమెరాలో ఆత్మహత్య చేసుకోవడం, అంతకు ముందు ఫోన్ మాట్లాడటం రికార్డ్ అయింది. ఫోన్లో సమాచారం అందుకున్న మహిళ హుటాహుటిన షాపు వద్దకు రాగా అప్పటికే జాఫర్ ఖాన్ ఆత్మహత్యకు పాల్పడి ఉండటాన్ని గమనించి స్థానికుల సహాయంతో, బాధితున్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీ గదికి తరలించారు. సంఘటన స్థలాన్ని టూటౌన్ పోలీసులు పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. మృతుడి ఫోన్ ను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అతడి కుటుంబ సభ్యులతో విచారించారు. మృతుడి సోదరుడు మహబూబ్ ఖాన్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ యువరాజు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగి


ప్రచారంలో పాల్గొన్న పోస్టుమాస్టర్ నాగయ్య

పీలేరు రూరల్ : ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగి పాల్గొన్న సంఘటన కెవిపల్లె మండలం తిమ్మాపురంలో జరిగింది. ఆదివారం పీలేరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి తిమ్మాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో తిమ్మాపురం బ్రాంచ్ పోస్టాఫీసులో పోస్టుమెన్‌గా పనిచేస్తున్న తిమ్మాపురం కురవపల్లెకు చెందిన నాగయ్య పాల్గొన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి టీడీపీ అభ్యర్థి నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న నాగయ్యపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు


వైఎస్సార్‌సీపీలో చేరిన కే.హరిప్రసాద్, కేటీ శేఖర్‌లతో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే


రాజంపేట: ఆకేపాటి సమక్షంలో చేరిన తెలుగు యువత నాయకులు


రైల్వేకోడూరు : పార్టీలో చేరినవారితో పంజం సుకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి


బి.కొత్తకోట: రెడ్డెప్పరెడ్డి, మహబూబ్‌బాషాలకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

పెద్దతిప్పసముద్రం : స్థానిక కింగ్ వెడ్డింగ్ హాల్‌లో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని మద్దయ్యగారిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు కే.హరిప్రసాద్, ములకలచెరువు మండలానికి చెందిన బీజేపీ ఎస్టీ సెల్ కార్యదర్శి కేటీ. శేఖర్‌లు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అంతేగాక వారితో పాటు వీరి అనుచరులు అల్లాబక్షు, మణి, జాకీర్, తలారి సుబ్బయ్య, సద్దాం, శ్రీనివాసులు, నారాయణ, శంకర్, నాయుడు, రెడ్డిబాషా, బ్రహ్మచారి, మౌలా, టైలర్ వజీర్, ఆది తదితరులు పార్టీలో చేరగా వారిని కండువాలతో సాదరంగా స్వాగతించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందస్తు సూచికగా పీటీఎం నుంచి మార్పు మొదలైందని, ప్రతి ఒక్కరూ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. మళ్ళీ జగనన్నను సీఎంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు నివ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, గణపతిరెడ్డి, కొండా సిద్దార్థ, డ్రిప్ రమణ, రియాసత్ అలీఖాన్, అనిత, కుమార్‌రెడ్డి, మొరుంపల్లి భాస్కర్‌రెడ్డి, సుబ్బరాం, స్థానిక నాయకులు తమక శంకర్, కార్యం చంద్ర, కొట్టి మల్లి పాల్గొన్నారు.

కొనసాగుతున్న చేరికలు

రాజంపేట : ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆకేపాటి స్వాగతిస్తున్నారు. సోమవారం ఆకేపాటి ఎస్టేట్‌లో నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలోని అరవపల్లెకు చెందిన తెలుగుయువత రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడు , సోషల్‌మీడియా కో–ఆరినేటర్ కాపు యువ నాయకుడు కొండిశెట్టి సుదర్శన్ పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె అర్బన్ నేతలు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ఆనాల మధుయాదవ్, ముమ్మడిశెట్టి సుధాకర్, మైనార్టీనేత ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.

- ఆడపూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కువైట్‌నేత గవర్నింగ్ సభ్యుడు లక్ష్మీప్రసాద్‌యాదవ్, యువనాయకు కొండ చైతన్య వర్మ ఆధ్వర్యంలో చేరిన వారిని పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పారు.
- ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆకేపాటి భవన్‌లో పెద్దకారంపల్లె పంచాయతీకి చెందిన కోనేటి సుబ్బరామయ్య, వెంకట్రాజు, వెంకటసుబ్బరాజు, సుబ్బరాజు, ఎరికలరాజు, రామకృష్ణరాజు, చంద్రశేఖర్, సుబ్బరాజు, కె.సుబ్బరాజు తదితరులు వైఎస్ఆర్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నేత చొప్పా వెంకటరెడ్డి ఎంపీటీసీ వరదరాజు, సర్పంచి వెంకట్రాజు, భాస్కర్‌రెడ్డి, సీ.వెంకట్రాజు, రఘురామరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 80 కుటుంబాలు చేరిక

రైల్వేకోడూరు : మండలంలోని ఉర్లగట్టుపోడు గ్రామ పంచాయతీకి చెందిన 80 టీడీపీ కుటుంబాలు సోమవారం రాత్రి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ గ్రామంలో పర్యటించిన సందర్భంలో స్థానికంగా ఉండే 80 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

ఈ కార్యక్రమంలో సిద్దయ్య, వెంకటేష్, సర్పంచ్ గోపి, వైస్ సర్పంచ్ రాజా, వంకాయల పెంచలయ్య, వంకాయల హరి, సురేంద్ర, భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

బి.కొత్తకోట : బి.కొత్తకోట మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్ రెడ్డి ముఖ్య అనుచరులైన కంచి రెడ్డప్పరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు టికెన్ మహబూబ్ బాషా, బురకాయలకోట మస్తాన్ లకు సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితోపాటు తెలుగు యువత జిల్లా కార్యదర్శి కే.మహేష్, వార్డు మాజీ సభ్యులు మేస్త్రీ ఆదినారాయణ, మున్నా, బాంబే రఫీ, మాజీ మండల ప్రచార కార్యదర్శి బి.సి.రామచంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు లాడెన్ అయూబ్, చెనిక్కాయల ఖాదర్ బాషా, చిట్టా ప్రభాకర్ రెడ్డి, కంచి రవిశేఖర్ రెడ్డి, బి.రామచంద్ర రెడ్డి పార్టీలో చేరారు. మాజీ సింగిల్ విండో చైర్మన్ సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు బండారు నాగరాజు తదితరులు పార్టీలో చేరగా మంత్రి పెద్దిరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. వైఎస్ఆర్ సీపీ నాయకుడు బుద్దల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్ఆర్‌సీపీలో చేరగా మంత్రి పెద్దిరెడ్డి కండువాలతో ఆహ్వానించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


ప్రసాద్ బాబు మృతదేహం

నందలూరు (రాజంపేట) : నందలూరు కన్యకా చెరువు కట్టపై కారు ఢీ కొనడంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాదు నుండి తిరుపతికి వెళ్తున్న పార్ట్యూన్ కారు పుల్లంపేట నుంచి కడపకు వెళ్తున్న టీవీఎస్ -50 ను ఢీ కొనడంతో స్కూటర్ పై వెళ్తున్న యాపరాల ప్రసాద్ బాబు (60) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడు కడప ఆర్టీసీ కాలనీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాడదుప్పి మృతి

సిద్దవటం : మండలంలోని భాకరాపేట- సిద్దవటం మార్గంలోని అయ్యప్ప స్వామి గుడికి సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని పాడదుప్పి మృతి చెందినట్లు ప్రయాణీకులు తెలిపారు. ఈ విషయాన్ని కడప రేంజర్ ప్రసాద్‌కు చేరవేశారు. ఈ మేరకు ఘటనా స్థలికి రేంజర్ ప్రసాద్ చేరుకుని మృతిచెందిన పాడదుప్పిని పరిశీలించారు.

వైఎస్ కుటుంబమంతా జగన్ వెంటే

వైఎస్సార్ సోదరుడు వైఎస్.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్ కుటుంబమంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉందని దివంగత వైఎస్సార్ సోదరుడు వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఇక్కడి ఐఎంఏ హాలులో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు, న్యాయవాదులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ తాము వైజాగ్‌లో ఉంటామని, ఎప్పుడైనా ఎన్నికల సమయంలో మాత్రమే ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తుంటామన్నారు. ఇటీవల తాను పాడేరులో ఒక పాఠశాలను చూశానని, హైదరాబాద్‌లో కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో మౌళిక వసతులు ఉన్నాయని తెలిపారు. మీ కుటుంబాలకు మేలు జరిగి ఉంటేనే తనకు ఓటేయమని అడిగిన సీఎం దేశంలో ఎవరూ లేరని ప్రశంసించారు.

- వైఎస్ విమలమ్మ కుమార్తె వైఎస్ దివ్యారెడ్డి మాట్లాడుతూ జగనన్న నవరత్నాలతో ఇచ్చిన భరోసాతో పేద ప్రజలు ఎలాంటి ఆందోళన లేకుండా జీవిస్తున్నారన్నారు. జగనన్న సీఎం అయ్యాక రెండేళ్లు కోవిడ్‌తో పోయిందని, ఈ మూడేళ్లలో ఎన్నికల్లో చెప్పినవన్నీ చేశారన్నారు. ఇంకో ఐదేళ్లు అవకాశమిస్తే ఇంకెంత చేస్తాడో ఆలోచన చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కడప రూపురేఖలు సమూలంగా మారిపోయాయన్నారు. విద్యారంగంపై జగనన్నకు ప్రత్యేక విజన్ ఉందని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా అంజద్‌బాషాను గెలిపించాలని కోరారు.
- వైఎస్ సుమధుర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ కుటుంబంలో జగన్ ఒంటరి అయ్యాడనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కుటుంబమంతా ఆయనతో ఉందని చెప్పారు. తన సంక్షేమ పథకాలతో జగనన్న పేదల జీవితాలను మార్చేశాడని తెలిపారు. నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చి వైఎస్ఆర్ కంటే రెండు అడుగులు ముందుకేసి ప్రజలకు మేలు చేస్తున్నారని తెలిపారు.
- జేసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన సాగిందన్నారు.
- యూఎస్ఏ ప్రతినిధి పండుగాయల రత్నాకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పిల్లలు యూఎన్‌ఓకు వెళ్లడం సామాన్యమైన విషయం కాదన్నారు. అనంతరం సజ్జల భార్గవ్ రెడ్డి వైద్యులు, న్యాయవాదులు, మేధావుల సలహాలు, సూచనలు స్వీకరించారు.
- ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు చైతన్యరెడ్డి, కరుణాకర్ రెడ్డి, జయసోమేశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెనుబాల విజయ్ కుమార్, సీహెచ్ వినోద్ కుమార్, సమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వైఎస్ కుటుంబీకులు, సజ్జల భార్గవ్‌రెడ్డి

కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్ చంద్రబాబు

ప్రభుత్వ సలహాదారుడు చల్లా మధుసూదన్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు చల్లా మధుసూదన్ రెడ్డి

రాజంపేట : రాజకీయ కుట్రలకు, కుతంత్రాలకు కేరాఫ్ చంద్రబాబు అనే పేరు ప్రజల్లో నానుతోందని ఏపీస్కిల్ డెవలప్‌మెంట్ సలహాదారుడు, ప్రభుత్వ సలహాదారుడు చల్లా మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కాపునేత, మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ మర్రి రవి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జననేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనలేక చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నారన్నారు. సభలలో ఏమి మాట్లాడుతున్నాడో కూడా తెలియని గందరగోళ పరిస్థితిలో బాబు ఉన్నాడన్నారు. ఇలాంటి వాళ్లు ఎంతమంది వచ్చినా వైఎస్ఆర్‌సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. మీకు మంచి జరిగి వుంటే ఓట్లు వేయమని రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్ పిలుపునిచ్చారన్నారు. ఆ విధంగా దేశంలో మునుపెన్నడూ ఏ ముఖ్యమంత్రి అనలేదన్నారు. మేమంతా సిద్ధం సభలతోనే గెలుపు సంకేతాలు బహిర్గతమయ్యాయన్నారు. నార్త్ అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రతినిధి పండుగాయల రత్నాకర్ మాట్లాడుతూ ప్రజలే తనకు స్టార్ క్యాంపెయినర్లు అని సీఎం వైఎస్ జగన్ చెబుతున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా ఐదేళ్ల పాలన కొనసాగిందన్నారు. మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా జనం నమ్మరన్నారు. గల్ఫ్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇలియాస్ మాట్లాడారు. సమావేశంలో గల్ఫ్ వైఎస్సార్‌సీపీ కో-కన్వీనరు గోవిందునాగరాజు, కువైట్ కో-కన్వీనరు మర్రిక శ్యామ్, కువైట్ వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీప్రసాద్‌యాదవ్, యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు డీలరు సుబ్బరామిరెడ్డి, తోట లక్ష్మీనారాయణ, యువనేత పోలా సాయి వైభవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.